
పోటెత్తిన వరదకు నిండుకుండలా మారిన మేడిగడ్డ బ్యారేజీ

# కాంగ్రెస్ కుట్రలు కాళేశ్వరంలో సమాధి

- **మేడిగడ్డ సగర్వంగా నిలబడింది**
- **బురద రాజకీయాలు భూస్థాపితం**
- **మానవ నిర్మిత అద్భుతం కాళేశ్వరం**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**




హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ సృష్టించిన కుట్రలు కొట్టుకుపోయాయని, బురద రాజకీయాలు భూస్థాపితమయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దుయ్యబట్టారు. 'ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరిలో కాంగ్రెస్ పార్టీ కొట్టుకుపోయి.. కాళేశ్వరం ప్రాజెక్టు సగర్వంగా నిలబడింది' అంటూ కాంగ్రెస్ కుట్రలను ఎక్స్‌వేదికగా శనివారం ఎండగట్టారు. మానవ నిర్మిత అద్భుతంగా కేసీఆర్ సర్కార్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిందని, అందుకు కేసీఆర్‌కు ఆయన సెల్యూట్ చేశారు. 'పోటెత్తిన వరదకు దుష్టశక్తుల పన్నాగాలే పటాపంచలయ్యాయి కానీ, కేసీఆర్ సమున్నత సంకల్పం జై కొడుతున్నది.. జల హారతి పడుతున్నది.. లక్షల క్యూసెక్కుల గంగా ప్రవాహంలో లక్షకోట్లు వృథా చేశారనే విమర్శలే గల్లంతయ్యాయి కానీ, మేడిగడ్డ బరాజ్ మాత్రం మొక్కవోని దీక్షతో నిలబడింది. కొండంత బలాన్ని చాటిచెబుతున్నది.. ఎవరెన్ని కుతంత్రాలు చేసినా..దశాబ్దాలుగా దగాపడ్డ ఈ తెలంగాణ నేలకు ఇప్పటికీ ఎప్పటికీ మేడిగడ్డే మన రైతుల కష్టాలు తీర్చే 'మేటి'గడ్డ ' అని అభివర్ణించారు. కాళేశ్వరమే కరువును పారదోలే కల్పతరువు అని, బురద రాజకీయాలను భూస్థాపితం చేసిన మానవ నిర్మిత అద్భుతానికి, కేసీఆర్‌కు తెలంగాణ సమాజం పక్షాన సెల్యూట్ అంటూ కేటీఆర్ పేర్కొన్నారు.

### ఆర్ నారాయణమూర్తికి కేటీఆర్ పరామర్శ

అనారోగ్యంతో బాధపడ్తున్న నటుడు, దర్శకుడు ఆర్ నారాయణమూర్తిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్‌లో పరామర్శించారు.ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు త్వరగా కోలుకోవాలని, అన్ని విధాలా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

## లోకం పోకడ



మీకు ఓ అయిదు జతల బట్టలు తీసుకుందాం, పదండి!

## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 31.8°c | 24.4°c |
| మెదక్ | 29.7°c | 22.2°c |
| నిజామాబాద్ | 29.5°c | 23.7°c |
| రంగారెడ్డి | 29.5°c | 21.6°c |
| ఖమ్మం | 28.0°c | 25.0°c |
| నల్లగొండ | 27.5°c | 21.4°c |
| కరీంనగర్ | 27.0°c | 24.0°c |
| వరంగల్ | 27.0°c | 23.0°c |
| మహబూబ్‌నగర్ | 25.1°c | 22.0°c |
| హైదరాబాద్ | 24.4°c | 22.2°c |

### 15 జిల్లాలకు హై అలర్ట్ జారీ

హైదరాబాద్, జూలై 20(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కొమరంభీమ్ ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. మరోవైపు భారీ వర్ష సూచన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. భద్రాద్రి జిల్లాలోని పెదవాగు పొంగిపొర్లుతుండటంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. పంట నష్టపోయిన రైతుల వివరాలు సేకరించాలని మంత్రి తుమ్మలకు సూచించారు.

# పెదవాగుపై అంతులేని నిర్లక్ష్యం

- **16,500 ఎకరాల ఆయకట్టుకు 14 వేల ఎకరాలు ఏపీ పరిధిలోనే..**
- **తెలంగాణ ఏర్పాటు తరువాత కేఆర్ఎంబీ పరిధిలోకి ఈ ప్రాజెక్టు**


భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని గుమ్మడవల్లి వద్ద పెదవాగు

ఖమ్మం, జూలై 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాల అంతులేని నిర్లక్ష్యం కారణంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని పెదవాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు అపారనష్టం వాటిల్లింది. దశాబ్దాల చరిత్ర కలిగిన పెదవాగు ప్రాజెక్టు పరిధిలో 16,500 ఎకరాల ఆయకట్టు ఉండగా సుమారు 14 వేల ఎకరాలు ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఉన్నది. తెలంగాణ ఏర్పాటు తరువాత ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వ పరిధిలోని గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు అప్పగించారు. ఆయకట్టు దామాషా ప్రకారం ప్రాజెక్టు నిర్వహణ, పర్యవేక్షణ వంటి వ్యయంలో 80 శాతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, 20 శాతం తెలంగాణ ప్రభుత్వం భరించాలని నిర్ణయించారు. ప్రాజెక్టు హెడ్‌వర్క్ తెలంగాణ పరిధిలో ఉండటంతో వీటి పర్యవేక్షణ తెలంగాణ జలవనరుల శాఖ అధికారులు చూస్తున్నారు. అసలు విషయానికొస్తే.. ఆంధ్రప్రదేశ్ ఎగువ ప్రాంతంలో కొద్దిరోజులుగా భారీగా వర్షాలు కురుస్తుండటంతో నీరు ప్రాజెక్టులోకి చేరి ఆనకట్టకు మూడుచోట్ల గండిపడింది. అధికారులు సరైన అంచనా వేసి ముందే నీటి విడుదల చేసి ఉంటే ప్రమాదం తప్పేది. కానీ అలా జరగకపోవడంతో వేలాది ఎకరాల పంట నీట మునిగింది. పొలాల నిండా ఇసుకమేట వేసింది. దాన్ని తొలగించడానికి ఎకరానికి రూ.30 వేల వరకు ఖర్చు అవుతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. 20 శాతమే వాటా కలిగినప్పటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1.20 కోట్లు మంజూరు చేయగా ప్రాజెక్టు ఆధునీకరణ పనులు పూర్తిచేశారు. ప్రస్తుతం పెదవాగుకు గండిపడటంతో దాదాపు 12 వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. అందులో 400 ఎకరాల వరి, 350 పత్తి, 50 ఎకరాలకుపైగా ఆయిల్‌పామ్ పంట దెబ్బతినగా మరో 300 ఎకరాల్లో ఇసుక మేట వేసినట్టు తెలుస్తున్నది. పొత్తూరు, బచ్చువారిగూడెం, నారాయణపురం, వద్దిరంగాపురం, ఖమ్మంపాడు తదితర ప్రాంతాల్లో అపారనష్టం సంభవించింది. పలు చోట్ల ఏపుగా పెరిగిన ఆయిల్‌పామ్ చెట్లు సైతం నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాయి.

# ప్రభుత్వ నిర్లక్ష్యంవల్లే పెదవాగుకు గండి

- **సకాలంలో గేట్లు తెరిస్తే ప్రమాదం తప్పేది**
- **నష్టపోయిన రైతన్నను ఆదుకోవాలి**
- **ఘటనపై విచారణ జరపాలి: హరీశ్‌రావు**


భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లివద్ద పెదవాగు ప్రాజెక్టు గేట్ల పక్కన పడిన గండి



హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): ఖమ్మం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లి సమీపంలో పెదవాగు ప్రాజెక్టు గండిపడి, కట్టకొట్టుకుపోయిన ఘటనపై మాజీమంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వల్లే పెదవాగు ప్రాజెక్టుకు గండి పడిందని మండిపడ్డారు. రైతులు హెచ్చరించినప్పుడే జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయి గేట్లు తెరిచి ఉంటే రూ.వంద కోట్ల నష్టం జరిగేది కాదని అన్నారు. కట్టమీద నుంచి నాలుగైదు గంటల పాటు నీళ్లు పొంగిపొర్లుతుంటే గేట్లు ఎత్తకుండా అధికారులు ఎందుకు ఆలస్యం చేశారని ప్రశ్నించారు. మూడు గేట్లుంటే, రెండు గేట్లే ఎత్తడంలో ఆంతర్యం ఏమిటి? అని అన్నారు. పెద్దవాగు ప్రాజెక్టు బద్దలై గుమ్మడివల్లి గ్రామాన్ని ముంచేసి ఉంటే ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించి వందల మంది గిరిజన బిడ్డల ప్రాణాలు ఫణంగా పెట్టారని తెలిపారు. పెదవాగు ప్రాజెక్టు తెలంగాణ భూ భాగంలోనే ఉన్నదని, పర్యవేక్షణ చేస్తున్నది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన నీటిపారుదల శాఖ అధికారులేనని వెల్లడించారు. ప్రాజెక్టుకు గండి పడటం వల్ల గుమ్మడివల్లి, రంగాపురం, కోయరంగాపురం, బుచ్చువారిగూడెం, నారాయణపురం గ్రామాల్లో తీవ్ర నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులుండీ ఏం లాభం?

పెదవాగు ప్రాజెక్టు ఘటన ముమ్మాటికి ప్రభుత్వ నిర్లక్ష్యమేనని హరీశ్‌రావు విమర్శించారు. రక్షించాలని అధికారులకు ఫోన్ చేసినా కనీస స్పందన లేదని మండిపడ్డారు. ఏపీ నుంచి హెలికాప్టర్లు సరైన కాలంలో రాకుంటే ఆరోజు వరదలో చిక్కుకున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారి ఉండేదని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్దవాగు ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వ తీరు దారుణమని మండిపడ్డారు. ప్రాజెక్టు కొట్టుకుపోయి రెండు రోజులైనా మంత్రులకు తీరిక దొరకలేదా? అని ప్రశ్నించారు. ముగ్గురు మంత్రులుండి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఒరగబెట్టింది ఏమిటి? అని నిలదీశారు.

### రైతులను ఆదుకోవాలి

ఇసుకమేట వేసిన ప్రతి ఎకరాకు రూ.25 వేలు, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ప్రత్యామ్నాయ పంటలకు ఉచితంగా విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం సరఫరా చేయాలన్నారు. పశువులు కోల్పోయిన రైతులకు ప్రకృతి వైపరీత్యనిధి నుంచి వెంటనే సహాయం చేయాలని వెల్లడించారు. ఘటనపై కారణాలు గుర్తించేందుకు, భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేందుకు ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.


మంచిర్యాల జిల్లా కోటపల్లిలో నీటిలో కొట్టుకుపోతున్న బైక్‌ను బయటకు తీసుకొస్తున్న గ్రామస్థులు


ములుగు జిల్లా కొండాయి గ్రామంలో ఫిట్స్ వచ్చిన వృద్ధురాలు పోచమ్మను దొడ్లవాగు దాటిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

# ముంచెత్తుతున్న ముసురు

- **ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలు**
- **వరద పోటెత్తి మత్తళ్లు పోస్తున్న చెరువులు**
- **కళ కళ లాడుతున్న భారీ జలాశయాలు**
- **రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తమైన అధికారులు**

న్యూస్‌నెట్‌వర్క్, జూలై 20 (నమస్తేతెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా రెండురోజులుగా రాష్ట్రాన్ని ముసురు వాన ముంచెత్తుతున్నది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న మోస్తరు నుంచి భారీ వర్షాలకు వరద నీరు పోటెత్తి చెరువులు, కుంటలు మత్తళ్లు పోస్తున్నాయి. జగిత్యాల జిల్లా ధర్మపురి వద్ద గోదావరి వరద ఉధృతి పెరిగింది. జగిత్యాల జిల్లాకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిందని, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ముసురుకు జనజీవనం స్తంభించింది. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని గ్రామాల్లో ఇండ్లు నేలమట్టమయ్యాయి. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లి సమీపంలోని వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆ గ్రామంలోని ఇద్దరు గర్భిణులు పులిశె అనూష, దబ్బగట్ల శైలజను బోటు ద్వారా సురక్షిత ప్రాంతానికి తరలించారు. కొండాయిలో ఫిట్స్‌కు గురైన వృద్ధురాలిని ఎన్డీఆర్ఎఫ్ బృందం బోటులో దొడ్లవాగు ఒడ్డుకు చేర్చి, అక్కడి నుంచి అంబులెన్స్‌లో మండల కేంద్రంలోని సామాజిక వైద్యశాలకు తరలించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పలుచోట్ల జోరు వాన కురిసింది.


మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం పడ్తన్‌పల్లిలో వర్షానికి కూలిన ఇల్లు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వర్షాలు లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి. పంటలు నీట మునిగాయి. ఇండ్లు కూలిపోగా, రోడ్లు కోతకు గురయ్యాయి. ఆసిఫాబాద్ మండలంలోని గుండి, తుంపెల్లి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చింతలమానేపల్లి మండలంలోని దిందా గ్రామం రెండు రోజులుగా జలదిగ్బంధంలో ఉంది. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలోని ఎర్రవాగు ఉప్పొంగడంతో లంబాడీతండా, ఖర్జీ, కోనంపేట గ్రామాల ప్రజలు ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వేమనపల్లి మండలంలోని నీల్వాయి ప్రాజెక్టులోకి భారీగా వరద చేరుతున్నది. ప్రాణహిత నది నిండుగా ప్రవహిస్తున్నది. ఉమ్మడి మెదక్, నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో వాన కురిసింది.

### అధికారులు అప్రమత్తంగా ఉండాలి: సీతక్క

గోదావరి వరదల పట్ల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సూచించారు. శనివారం సచివాలయం నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా జిల్లాల కలెక్టర్లతోపాటు సొంత జిల్లా ములుగు కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి వరద పరిస్థితులపై సమీక్షించారు.

### ఆటంకం కలగొద్దు: మంత్రి పొంగులేటి

భారీ వర్షాల వల్ల జనజీవనానికి ఆటంకాలు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు మరో రెండు రోజుల పాటు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోదావరి ఉధృతి క్రమంగా పెరుగుతుండటంపై గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయా జిల్లా కలెక్టర్లకు సూచించారు. విద్యుత్తు, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ తదితర విభాగాలతో రెవెన్యూ యంత్రాంగం సమన్వయం చేసుకోవాలని, రెవెన్యూ అధికారులు, సిబ్బందికి సెలవులు రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.


చిత్తడిగా మారిన లింగనవాయి పాఠశాల ఆవరణలో ఆందోళనచేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

### బురద ఇలా.. వెళ్లేదెలా?

- **చిత్తడిగా లింగనవాయి పాఠశాల**
- **విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన**

అలంపూర్, జూలై 20: మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాఠశాల ఆవరణ చిత్తడి చిత్తడిగా మారిందని, పాఠశాలలోకి విద్యార్థులు ఎలా వెళ్లాలని వారి తల్లిదండ్రులు శనివారం ఆందోళకు దిగారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వానలతో జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండలం లింగనవాయి ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాల ఆవరణ బురదమయంగా మారింది. మైదానం మొత్తం వర్షపు నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు బురదలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని తెలుసుకున్న వారి తల్లిదండ్రులు అక్కడకు చేరుకొని నిరసన తెలిపారు. బడి ఆవరణలో మట్టిపోసి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# గలగలా గోదారి.. బిరబిరా కృష్ణమ్మ

- **జూరాలకు భారీగా వరద**
- **ఎస్సారెస్పీకి 15 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**
- **మేడిగడ్డ వద్ద 4లక్షల క్యూసెక్కులు..**


ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ నుంచి దిగువకు వెళ్తున్న వరద

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ)/న్యూస్‌నెట్‌వర్క్: కర్ణాటక, మహారాష్ట్రలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ ఉరకలేస్తున్నది. ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టును దాటుకుని బిరబిరామంటూ జూరాలకు పరుగులు తీస్తున్నది. జూరాల ప్రాజెక్టు 17 స్పిల్‌వే గేట్లను అధికారులు తెరిచారు. శనివారం సాయంత్రం వరకు ఇన్‌ఫ్లో 90,800 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 1,04,416 క్యూసెక్కులుగా నమోదైనట్టు అధికారులు తెలిపారు. జూరాల పూర్తిస్థాయి సామర్థ్యం 9.657 టీఎంసీలకుగాను 7.645 టీఎంసీలకు చేరింది. తుంగభద్ర డ్యాం 68 టీఎంసీలకు చేరింది. ఇన్‌ఫ్లో 1,02,744 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 1,527 క్యూసెక్కులుగా నమోదైంది. శ్రీశైలం ప్రాజెక్టుకు 29 వేల క్యూసెక్కుల వరద కొనసాగుతున్నది. విద్యుదుత్పత్తి ద్వారా దిగువన నాగార్జునసాగర్‌కు నీరు విడుదల చేస్తున్నారు.

### ఎస్సారెస్పీకి 15 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గోదావరి బేసిన్‌లోని నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతున్నది.శనివారం రాత్రి తొమ్మిది గంటలకు 15 వేల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80 టీఎంసీలు) కాగా, శనివారం రాత్రి వరకు 1066.80 అడుగులు (18.443 టీఎంసీలు) మేర నీరు నిల్వ ఉన్నది. కడెం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 15,338 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా, 3 గేట్లు ఎత్తి దిగువకు 11,022 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 700 అడుగులు (7.603 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 690.400 (5.345 టీఎంసీలు) అడుగుల మేర నీరు ఉన్నది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సమీపంలోని అడ ప్రాజెక్టుకు 1778 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 1941 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.


జూరాల ప్రాజెక్టు నుంచి పరుగులు పెడుతున్న వరద

### మేడిగడ్డకు 3,73,500 క్యూసెక్కులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బరాజ్‌కు శనివారం ఇన్‌ఫ్లో 3,73,500 క్యూసెక్కులు ఉండగా, బరాజ్‌లోని మొత్తం 85 గేట్లు ఎత్తి అంతేమొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బరాజ్ రివర్ బెడ్ సముద్ర మట్టానికి 88 మీటర్లు కాగా, ప్రస్తుత వరద ప్రవాహం 93.10 మీటర్ల ఎత్తులో పారుతున్నది. అన్నారం బరాజ్‌కు మానేరుతోపాటు చిన్న, చిన్న కాల్వల ద్వారా 16,500 క్యూసెక్కులు వస్తున్నట్టు అధికారులు తెలిపారు. వచ్చిన నీటిని మొత్తం 66 గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్నారు.

### పెరుగుతున్న గోదావరి..

ఎగువన కురుస్తున్న వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 35.50 అడుగులకు చేరింది. మహారాష్ట్ర, ఆదిలాబాద్ జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత నది ఉప్పొంగుతున్నది. దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిమట్టం 80 మీటర్లకు చేరింది. ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి శనివారం సాయంత్రం 12.210 మీటర్ల ఉధృతితో ప్రవహిస్తున్నది. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమ్మక్క బరాజ్‌కు శనివారం ఎగువ నుంచి 4,58,340 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్టు అధికారులు తెలిపారు. మొత్తం 59 గేట్లు ఎత్తి నీటిని దిగువకు పంపిస్తున్నారు.

# తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తం

- **గ్రావిటీ ద్వారా నీటిని తరలిస్తం**
- **ఈ సీజన్‌లో ఎల్లంపల్లి నుంచి కాళేశ్వరాన్ని వినియోగిస్తం**
- **మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**
- **బరాజ్‌ల పునరుద్ధరణపై ఎన్డీఎస్‌ఏ చైర్మన్‌తో ఢిల్లీలో భేటీ**



హైదరాబాద్, జూలై20 (నమస్తే తెలంగాణ): తుమ్మిడిహట్టి వద్ద కొత్త ప్రాజెక్టు కడతామని సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పునరుద్ఘాటించారు. మేడిగడ్డ మినహా ఎల్లంపల్లి నుంచి ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు కాంపోనెంట్లు అన్నింటినీ ఈ సీజన్‌లో వినియోగిస్తామని తెలిపారు. ఎన్డీఎస్‌ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) సిఫార్సుల మేరకే మేడిగడ్డను పునరుద్ధరిస్తామని వివరించారు. రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులతో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం ఢిల్లీ వెళ్లిఎన్డీఎస్‌ఏ చైర్మన్ అనిల్‌జైన్‌తో భేటీ అయ్యారు. ఎన్డీఎస్‌ఏ మధ్యంతర నివేదిక మేరకు చేపట్టిన పనులు వివరించారు. సాంకేతిక పరీక్షలన్నీ పూర్తి చేయాలని, అప్పటివరకు బరాజ్‌లలో నీటిని నిల్వ చేయవద్దని ఎన్డీఎస్‌ఏ అధికారులు వెల్లడించినట్టు తెలిసింది. సోమవారం మరోసారి ఇంజినీర్ల స్థాయిలో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.

### ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోస్తాం

ఎన్డీఎస్‌ఏతో భేటీ తర్వాత స్థానిక మీడియా ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్డీఎస్‌ఏతో సుదీర్ఘంగా చర్చించామని వెల్లడించారు. ఎల్లంపల్లి నుంచి కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అన్నింటినీ వినియోగించుకుంటామని వెల్లడించారు. తుమ్మిడిహట్టి వద్ద కొత్త ప్రాజెక్టును పూర్తిచేసి గ్రావిటీ ద్వారా నీటిని తరలిస్తామని చెప్పారు. పెద్దవాగు అంతర్రాష్ట్ర ప్రాజెక్టనీ, దాని ఆయకట్టంతా ఏపీలోనే ఉన్నదని, ఆ ప్రాజెక్టుకు గండి పడితే తమను బాధ్యులని చేయడం సరికాదని చెప్పారు. సమావేశంలో నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్, ఎక్స్‌పర్ట్ కమిటీ సభ్యులు ఈఎన్సీలు అనిల్‌కుమార్, నాగేందర్‌రావు, సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు.

# మేడిగడ్డపై వాస్తవాలు గ్రహించండి

- **రాహుల్ గాంధీకి బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీష్‌రెడ్డి సూచన**
- **కుట్రలు పటాపంచలయ్యాయని స్పష్టీకరణ**

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధాన్ని వందసార్లు నిజం చేయాలనుకొని అడ్డంగా బుక్కయ్యిందని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీష్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణకు ప్రాణధారలాంటి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ చేసిన కుట్రలు నిర్వీర్యమయ్యాయని శనివారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు. భారీ ఎత్తున వరదను తట్టుకుని మేడిగడ్డ బ్యారేజీ ఠీవీగా నిలబడిందని, గతంలో బరాజ్‌కు వెళ్లి నానా యాగీ చేసిన రాహుల్ గాంధీని ఇప్పుడు తీసుకెళ్లి చూపించాలని ఆయన కాంగ్రెస్‌కు సూచించారు. ఒక్క రాహుల్‌గాంధీయే కాదు, సమస్త కాంగ్రెస్ శ్రేణులు మేడిగడ్డను సందర్శించి తరించాలని ఎద్దేవాచేశారు. 'మేడిగడ్డ ప్రాజెక్టు కూలిపోయింది.. పడిపోయింది.. పనికిరాకుండాపోయింది' అని నానా యాగీ చేసిన వాళ్లు ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టును చూసి రావాలని చెప్పారు. రూ.80వేల కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని నాడు వ్యాఖ్యానించిన రాహుల్ గాంధీ ఇప్పుడు బరాజ్‌ను పరిశీలించి వాస్తవాలు తెలుసుకోవాలని హితవుపలికారు. మేడిగడ్డ ఉన్నదా? కొట్టుకుపోయిందా? కూలిపోయిందా? అని హేళన చేసిన అదే కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.